ఘనంగా యోగా దినోత్సవం

- వివిధ సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు
- ఉత్సాహంగా పాల్గొని ఆసనాలు వేసిన ఔత్సాహికులు

కార్పొరేషన్/ కొత్తపల్లి/ కలెక్టరేట్/ తెలంగాణచౌక్/ రాంనగర్, జూన్ 21 : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా వివిధ సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో పల్లెలు మొదలు నగరం వరకు యోగాపై శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించగా, విద్యార్థులు, యువకులు, వృద్ధులు ఉత్సాహంగా పాల్గొని యోగాసనాలు వేశారు. ఆయా చోట్ల కార్యక్రమాలకు హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు ఆరోగ్య సంరక్షణలో యోగా ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగా సాధన చేయాలని సూచించారు. స్థానిక జ్యోతిబాపూలే మైదానంలో జరిగిన వేడుకల్లో మేయర్ యాదగిరి సునీల్ రావు పాల్గొని మాట్లాడుతూ, సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలంటే ప్రతిరోజూ యోగా సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వాల రమణారావు, తదితరులు పాల్గొన్నారు. నగరంలోని డా. బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో పతంజలి యోగ సమితి, భారత్ స్వాభిమాన్, ఆయుష్ డిపార్ట్ మెంట్, నెహ్రూ యువకేంద్ర సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగా దినోత్సవ కార్యక్రమాన్ని కరీంనగర్ ఆర్డీవో కే మహేశ్వర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిజ జీవితంలో మనిషి ఎన్నో ఒత్తిళ్లకు గురవుతున్నారని, యోగాతో వాటి నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏసీపీ నరేందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగార్జున, డీఎంహెచ్వో డాక్టర్ సుజాత, నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ ఎం వెంకటరాంబాబు, ముత్యాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు. నగరంలోని జడ్పీ క్వార్టర్స్‌లో గల సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డివిజనల్ రెవెన్యూ అధికారి కుందారపు మహేశ్వర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, యోగాతో అనునిత్యం ఆరోగ్యంగా ఉంటూ, ఉత్సాహంగా, ఉల్లాసంగా తమ పనులు చేసుకోవచ్చన్నారు. డేకేర్ సెంటర్ నిర్వహణ కమిటీ బాధ్యుడు సముద్రాల జనార్దన్‌రావు మాట్లాడుతూ, యోగాతో మానసిక ఒత్తిడిని నివారించి, ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్డీవో మహేశ్వర్, యోగా శిక్షకుడు రాజేందర్‌ను డేకేర్ సెంటర్ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డేకేర్ సెంటర్ ప్రధాన కార్యదర్శి పెండ్యాల కేశవరెడ్డి, ఉపాధ్యక్షుడు ఉప్పల రామేశం, జడ్జి టీ ఈశ్వర్, ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ ఏరియా కో ఆర్డినేటర్లు అన్నమనేని సుధాకర్‌రావు, బుర్ర జగదీశ్వర్‌గౌడ్, కొండూరి సత్యనారాయణ, నర్సింహారెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ చింతలపల్లి రాజారెడ్డి, సింగమరాజు, చింతల సత్యనారాయణ, రామకృష్ణారెడ్డి, బ్రహ్మానందం, సురేంద్రాచార్యులు, లక్ష్మయ్య, భూంపల్లి మోహన్‌రెడ్డి, మందాడి దేవేందర్‌రెడ్డి, వీ మల్లయ్యతో పాటు వందమంది వయోవృద్ధులు పాల్గొన్నారు.

సెయింట్ జార్జ్ స్కూల్‌లో యోగాసనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో యోగాసనాలు వేస్తున్న పోలీసులు

- ప్రాంతీయ క్రీడా పాఠశాలలో జిల్లా యువజన క్రీడా శాఖ, జిల్లా యోగా అసోసియేషన్స్ సంయుక్తంగా నిర్వహించిన యోగా దినోత్సవంలో తెలంగాణ రాష్ట్ర యోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ పాల్గొని మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగంగా చేసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. యోగాను స్పోర్ట్స్ కోటాలో చేర్చడం దానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనమని జిల్లా యోగా అసోసియేషన్ కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి తెలిపారు.
- కొత్తపల్లిలోని అల్ఫోర్స్ హైస్కూల్‌లో ఎన్‌సీసీ సమన్వయంతో వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ. ప్రతి వ్యక్తి ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేకుండా జీవించాలంటే ప్రతిరోజూ యోగా, వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ కెడెట్స్ పూజశ్రీ, సూర్యప్రకాశ్, శిక్షకుడు లక్ష్మణ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- సెయింట్ జార్జ్ సీబీఎస్ఈ ఇంటర్నేషనల్ పాఠశాలలో యోగా డే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విద్యా సంస్థల చైర్మన్ డా. పీ ఫాతిమారెడ్డి మాట్లాడుతూ, ఆరోగ్య సంరక్షణతో పాటు, జ్ఞానాన్ని పెంచుకోవడానికి యోగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ భార్గవ్, నిరంజన్, శిక్షకుడు ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.
- విద్యానగర్‌లోని సువిద్య పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ మట్టతిల్ బాబు, ప్రిన్సిపాల్ మధుకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.
- హనుమాన్‌నగర్‌లోని బ్లూబెల్స్ పాఠశాలలో యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జంగ సునీతామనోహర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. భగవతీ పాఠశాలలో యోగాడే, మ్యూజిక్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ బీ రమణారావు, కరస్పాండెంట్ బీ విజయలక్ష్మి సహకారంతో విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మోనికారాయ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మానేరులో యోగాసనాలు వేస్తున్న విద్యా సంస్థల నిర్వాహకులు, విద్యారులు

- మానేరు పాఠశాలలో యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులతో ఆసనాలు, ధ్యానం, ప్రాణాయామం చేయించారు. మానేరు విద్యా సంస్థల అధినేత కడారి అనంతరెడ్డి మాట్లాడుతూ, ప్రపంచానికి భగవద్గీతను అందించిన భారతదేశం, నేడు యోగాను విశ్వ వ్యాప్తం చేసిందన్నారు. కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ కడారి కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.
- పద్మనగర్, మంకమ్మతోటలోని పారమిత పాఠశాలల్లో యోగా డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో పాఠశాలల చైర్మన్ డాక్టర్ ఈ ప్రసాదరావు మాట్లాడుతూ, వయస్సు పెరిగినా తాను ఆరోగ్యంగా ఉండడానికి యోగానే ప్రధాన కారణమని, ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో యోగా శిక్షకుడు ఉదయ్ కిరణ్‌రెడ్డి, డైరెక్టర్స్, ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.
- నగరంలోని ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) జిల్లా సహసంఘచాలక్ యెలగందుల సత్యం జీ మాట్లాడుతూ, ప్రాణాయామం, ఆసనాలు, సూక్ష్మవ్యాయామం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత, దృఢత్వం కల్గుతుందన్నారు. కార్యక్రమంలో విభాగ్ ప్రచారక్ భానుజీ, మాధవసేవా సమితి సంయుక్త కార్యదర్శి కామారపు ప్రసాద్‌తో పాటు పలువురు సంఘ కార్యకర్తలు పాల్గొన్నారు.
- కమిషనరేట్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా డేలో అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ యోగా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలతో పాటు రిజర్వు ఇన్‌స్పెక్టర్లు రజినీకాంత్, కుమారస్వామి, శ్రీధర్ రెడ్డి, సురేశ్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రతినిధులు గంగిశెట్టి అరుణ్ కుమార్, రాజు, సరస్వతి, జిల్లా బాడీ బిల్డింగ్ సెక్రటరీ శ్రీపతి దామోదర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జ్యోతిబాపూలే మైదానంలో యోగా డే వేడుకల్లో పాల్గొన్న మేయర్ సునీల్‌రావు

తిమ్మాపూర్/ రూరల్/ మానకొండూర్/ వీణవంక/ చిగురుమామిడి/చొప్పదండి, జూన్ 21: తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీలో గల మానసిక వికలాంగుల పాఠశాలలో ఏవో బాలరాజు, ప్రిన్సిపాల్ సతీశ్ ఆధ్వర్యంలో, అలాగే వాగేశ్వరి ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వలంటీర్ రామ్మోహన్ రెడ్డి విద్యార్థులతో ఆసనాలు వేయించారు. వీరితో పాటు పలు కళాశాలల్లో ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు యోగా చేయించారు. అలాగే మన్నెంపల్లిలో గ్రామస్తులు, ఉపాధి హామీ సిబ్బంది ఆసనాలు వేశారు. శంకరపట్నం మండలం మొలంగూర్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం నీరజ, ఇతర పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఆసనాలు వేయించారు.

- తిమ్మాపూర్ మండలంలోని జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (అటానమస్) కళాశాలలో యోగా దినోత్సవాన్ని కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు ప్రారంభించి మాట్లాడుతూ, రోజు యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చన్నారు. యోగా ట్రైనర్ రమేశ్, మెడిటేషన్ ట్రైనర్ సుధాకర్ విద్యార్థులకు ఆయా అంశాల్లో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ రావు, అకాడమిక్ డీన్ డాక్టర్ పీకే వైశాలి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రణీత, టీ ప్రవీణ్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.
- మానకొండూర్ మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో యోగా గురువుతో కలిసి నాయకులు యోగాసనాలు అభ్యసించారు. కార్యక్రమంలో కరీంనగర్ మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, బీజేపీ మండలాధ్యక్షుడు రాపాక ప్రవీణ్, నాయకులు పాల్గొన్నారు.
- వీణవంకలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పోతిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో విద్యార్థినులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో ఆయుర్వేద డా.రవికుమార్, డా.షబానా, సంపత్, కేజీబీవీ ప్రత్యేకాధికారి లావణ్య, పీఈటీ మౌనిక, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.
- చిగురుమామిడి ఉన్నత పాఠశాల ఆవరణలో, మండల కేంద్రంలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్ వద్ద కొండాపూర్ మాజీ ఉపసర్పంచ్ పైడిపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామస్తులతో యోగాసనాలు వేయించి, యోగా ప్రాముఖ్యతను వివరించారు. గాగిరెడ్డి పల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు. ప్రధానోపాధ్యాయుడు రామచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ అచ్చ రవీందర్, డెయిరీ చైర్మన్ పన్యాల శ్రీధర్ రెడ్డి, మాజీ చైర్మన్ కంది శంకర్, ముంజ చంద్రయ్య, పెనుకుల సంపత్, గొల్లపల్లి సదాచారి, చంద్రశేఖర్, మకుటం సంపత్, వెంకన్న, కుమార్, సంపత్, అజయ్, ప్రణయ్ పాల్గొన్నారు.
- చొప్పదండి మండలం రుక్మాపూర్ ఆదర్శ మోడల్ పాఠశాలలో విద్యార్థులు వేసిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కోల రమేశ్ యోగా ప్రాముఖ్యతను వివరించగా, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.
- రామడుగు మండలం వన్నారం ఎంయూపీఎస్ పాఠశాలలో నిర్వహించిన ప్రపంచ యోగ , ప్రపంచ సంగీత దినోత్సవంలో రిటైర్డ్ ఎస్ఆర్ఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పాఠశాలలో ఆటపాటలతో పాటు చక్కని విద్యాబోధన అందిస్తూ పాఠశాలలో ప్రతి వారం యోగా తరగతులు నిర్వహించడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జక్కుల లక్ష్మీనారాయణను అభినందించారు. అనంతరం ప్రపంచ సంగీత దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో పనిచేస్తున్న సంగీత దర్శకుడు కేబీ శర్మను సత్కరించారు. కార్యక్రమంలో బూరుగుల రవీందర్, ఉమాపతి, మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

స్మార్ట్‌సిటీపై మాట మార్చిన సునీల్‌రావు

- నిన్నటి వరకు సంజయ్‌ను తిట్టి ఇప్పుడు పొగుడుతావా?
- బీఆర్ఎస్ జిల్లా మాజీ అధికార ప్రతినిధి హరిప్రసాద్

కరీంనగర్ కార్పొరేషన్ జూన్ 21 : కరీంనగర్ స్మార్ట్‌సిటీ కోసం ఒక్క పైసా కూడా కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తేలేదని నిన్నా మొన్నటి వరకు తిట్టి పోసిన మేయర్ సునీల్‌రావు ప్రస్తుతం మాట మార్చడంలో ఆంతర్యమేంటని బీఆర్ఎస్ మాజీ జిల్లా అధికార ప్రతినిధి, పార్టీ మీడియా సెల్ జిల్లా మాజీ ఇన్‌చార్జి గుంజపడుగు హరిప్రసాద్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. కరీంనగర్‌కు స్మార్ట్ సిటీని మంజూరు చేయించింది, అభివృద్ధికి నిధులు తెచ్చింది అప్పటి పార్లమెంట్ సభ్యుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అని పేర్కొన్నారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ మంజూరులో, కరీంనగర్ అభివృద్ధికి నిధులు తేవడంలో గత ఎంపీ, ప్రస్తుత కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ పాత్ర లేదంటూ గత ఐదేళ్లుగా విమర్శలు చేసిన సునీల్‌రావు.. ప్రస్తుతం మాట మార్చారంటూ విమర్శించారు. స్మార్ట్ సిటీ తేవడంలో, కరీంనగర్ అభివృద్ధిలో బండి సంజయ్ పాత్ర ఏమాత్రం లేదన్న ఆయన, ఇప్పుడు బండి సంజయ్ ద్వారానే స్మార్ట్ సిటీ నిధులు వచ్చాయని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. స్మార్ట్ సిటీ నిధులు బండి సంజయ్ ద్వారా వచ్చాయని మేయర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. స్మార్ట్ సిటీ క్రెడిట్ అంతా వినోద్‌కుమార్‌దేనని ఈ విషయం కరీంనగర్ జిల్లా ప్రజలందరికీ తెలుసని తెలిపారు. మేయర్ సునీల్‌రావు తాను చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

కష్టపడితే ఫలితం మనదే: కలెక్టర్

జిల్లాకు వచ్చిన అవార్డును కలెక్టర్‌కు అందజేస్తున్న డీఆర్‌డీవో అధికారులు

కలెక్టరేట్, జూన్ 21: విధి నిర్వహణలో కష్టపడి పనిచేస్తే ఫలితం మనకు తప్పకుండా దక్కుతుందని, ఇందుకు నిదర్శనమే డీఆర్‌డీవో విభాగం రాష్ట్ర స్థాయిలో ఉత్తమంగా నిలవడమని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. బ్యాంకు లింకేజీలో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో నిలువగా, రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్న డీఆర్‌డీవో అధికారులు శుక్రవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారి కృషిని అభినందిస్తూ, ఇదే స్ఫూర్తితో సమర్థవంతంగా సేవలందిస్తే తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం ఈనెల 15న హైదరాబాద్‌లో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా అందుకున్న అవార్డును కలెక్టర్‌కు డీఆర్‌డీవో అధికారులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్‌డీవో శ్రీధర్, అదనపు డీఆర్‌డీవో సునీత, డీపీఎం బ్యాంకింగ్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టరేట్, జూన్ 21: కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఉద్యోగులు, సిబ్బంది, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ పక్కన ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆమె శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్‌వో పవన్‌కుమార్, కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సరిత, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంగారిక టౌన్‌షిప్‌లో వసతుల కల్పన వేగవంతం

కార్పొరేషన్, జూన్ 21: తిమ్మాపూర్ మండలం సుభాష్‌నగర్‌లో ఏర్పాటు చేసిన అంగారిక టౌన్ షిప్‌లో మౌలిక సదుపాయాల కల్పన వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సుడా, మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. టౌన్ షిప్‌లో విద్యుత్, సీసీ రోడ్ల పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా పనుల విషయంలో జాప్యం చేస్తే ఊరుకునేది లేదన్నారు. ఈ పనులు పూర్తయిన తర్వాత మిగిలిపోయిన ప్లాట్లకు సంబంధించిన వేలంపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ప్లాట్లకు సంబంధించిన ఆదాయం, మౌలిక వసతుల వ్యయం, రిజిస్ట్రేషన్ సంబంధించిన పూర్తి వివరాలు అందించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్‌వో పవన్‌కుమార్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి, తహసీల్దార్ కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సతీమణి మృతికి ప్రముఖుల సంతాపం

చొప్పదండి, జూన్ 21: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి మృతి బాధాకరమని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, సింగిల్‌విండో చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, మండలంలోని ప్రజాప్రతినిధులు, పలు పార్టీల మండలాధ్యక్షులు వేర్వేరుగా సంతాపం ప్రకటించారు. కాగా, శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన రూపాదేవి అంత్యక్రియల్లో మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని, ఎమ్మెల్యేను పరామర్శించారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కమాన్‌చౌరస్తా, జూన్ 21: జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్ జడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో 22వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ ఈవో కాంతారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా, సోమవారం స్వామివారి కల్యాణ మహోత్సవం జరుగుతుందని, ఈ సందర్భంగా మేయర్ వై సునీల్ రావు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం స్వామి వారి ఊరేగింపుతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఫీజుల నియంత్రణ కమిటీలు ఏర్పాటు చేయాలి

కమాన్‌చౌరస్తా, జూన్ 21: రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ కమిటీ ఏర్పాటు చేయాలని శుక్రవారం భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్(యూఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో స్కూల్ బోర్డ్ అదనపు డైరెక్టర్ కే లింగయ్యకు వినతి పత్రం అందజేశారు. అనంతరం సంఘ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఫీజుల నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేయాలని, అలాగే డీఈవోల అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చినవారిలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెదలాపురం మధు, నాయకులు వెంకట్, వికాస్, జయకృష్ణ తదితరులు ఉన్నారు.

ఆరుగురిపై మాల్ ప్రాక్టీస్ కేసు

కమాన్‌చౌరస్తా, జూన్ 21 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షల్లో ఆరుగురిపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని పలు కళాశాలల్లో పరీక్షకు హాజరైన విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడ్డారని తెలిపారు.

ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

జమ్మికుంట, జూన్ 21: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న పట్టణంలోని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు రాపర్తి అఖిల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఇక్కడ విజయ్, శ్రీనాథ్, అఖిల్, రాజ్‌కుమార్, అభినయ్, సాక్షిత్, తదితరులున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, జూన్ 21: నగరంలో లైన్ మెయింటనెన్స్, ఇతర మరమ్మతులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సప్తగిరి కాలనీలో కొంత ప్రాంతం, రాంచంద్రాపూర్ కాలనీ, ఏవోస్ కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్-2 ఏడీఈ సుధీర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆలయాల్లో బండి సంజయ్ ప్రత్యేక పూజలు

తిమ్మాపూర్/ మానకొండూర్ రూరల్/ ఇల్లందకుంట, జూన్ 21: శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామి ఆలయంలో కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అలాగే తాడికల్ సొసైటీ నూతన భవనాన్ని కేంద్ర సహాయ మంత్రి ప్రారంభించారు. మండలాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లిలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో కందుల సుధాకర్ శాలువాతో సత్కరించి, దేవతామూర్తుల జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమాల్లో మాజీ మంత్రి పెద్దిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, బీజేపీ ఇల్లందకుంట మండలాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, పీఏసీసీ వైస్ చైర్మన్ షఫీ, బీజేపీ నాయకులు సురేందర్‌రెడ్డి, రాజయ్య, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ఇల్లందకుంట: సీతారామచంద్రస్వామి ఆలయంలో కేంద్ర సహాయ మంత్రికి జ్ఞాపికను అందజేస్తున్న ఈవో సుధాకర్

జయశంకర్ సార్‌కు ఘన నివాళి

కార్పొరేషన్/ కొత్తపల్లి/ సైదాపూర్/ చిగురుమామిడి, జూన్ 21: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం తన జీవితాన్ని పూర్తిగా ధారబోసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు కొనియాడారు. జయశంకర్ వర్ధంతి సందర్భంగా స్థానిక టవర్‌సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి మేయర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి జిల్లా టీఎన్జీవో నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి, కేంద్ర సంఘ ఉపాధ్యక్షుడు నాగుల నరసింహస్వామి, కార్యదర్శి గూడ ప్రభాకర్‌రెడ్డి , జిల్లా నాయకులు గంగారపు రమేశ్, ఆజ్గర్, పట్టణ అధ్యక్షుడు సర్దార్ హర్మేందర్‌సింగ్, రూరల్ అధ్యక్షుడు రాజేశ్ భరద్వాజ్, నాయకులు సుమంత్ రావు, సర్దార్ మంజీత్‌సింగ్, కోట రామస్వామి, నరసింహారెడ్డి, పవన్, శంకర్, ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం, ఆటో డ్రైవర్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. సైదాపూర్ మండలం సోమారం ఆదర్శపాఠశాలలో ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫర్హాణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చిగురుమామిడి మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జయశంకర్ సార్ వర్ధంతి నిర్వహించారు. సంఘం మండలాధ్యక్షుడు శ్రీ రామోజ్ రాజకుమార్, మండల ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి సదాచారి, సంఘం నాయకులు అనుమోజు బాలకృష్ణ, సదానందాచారి, శ్రీనివాస్, సదాచారి, వెంకటాచారి, చిరంజీవి, తిరుపతి, శ్రీనివాస్, రాజయ్య, తిరుపతి, వెంకన్న, సత్తయ్య, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీఎన్జీవోస్ నాయకులు

కళాకారిణిని సత్కరిస్తున్న ఆర్డీవో, నిర్వాహకులు

మనసును ఉత్తేజపరిచేది సంగీతం

- కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్

కమాన్‌చౌరస్తా, జూన్ 21 : మనసును ఉత్తేజపరిచేది సంగీతం అని, అలాంటి సంగీతం అందిస్తున్న కళాకారులను ప్రోత్సహించాలని ఆర్డీవో మహేశ్వర్ పేర్కొన్నారు. ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఫిలింభవన్‌లో ప్రవీణ్ సల్వాజి మ్యూజికల్ గ్రూప్, సల్వాజి ఈవెంట్స్ సంయుక్తంగా నిర్వహించిన వేడుకకు ఆర్డీవో ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. సంగీత సాహిత్యాలు విశ్వజనీనమని పేర్కొన్నారు. ప్రతి ఏటా సంగీత దినోత్సవాన్ని జరుపుతూ, కళాకారులను అందరికీ పరిచయం చేస్తున్న సల్వాజి ప్రవీణ్‌ను అభినందించారు. సీనియర్ గాయకులు నామ్‌దేవ్, బొజ్జ రేవతి, గొల్లపల్లి రవీందర్, మురళి మధు, టీ మోహనస్వామి, జీ కృపాదానం, సుమారు 10 జిల్లాల నుంచి వచ్చిన కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ గాయకుల పాటలతో పాటు సంగెం రాధాకృష్ణ బృందం, రామకృష్ణ బృందం నృత్యాలు అలరించాయి. కృపాదానం అధ్యక్షతన, సల్వాజి ప్రవీణ్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ తిరుపతయ్య, అజయ్, గుండేటి రమేశ్, అనుముల దయాకర్, అభి, బాబు గౌరవేని, సల్వాజి సంధ్య, కళాకారులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

రాంనగర్, జూన్ 21: నగరంలోని కట్టరాంపూర్‌కు చెందిన యువకుడి అదృశ్యంపై అతడి భార్య ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మంచిర్యాల జిల్లాకు చెందిన రితిక్ (24) నగరంలో భార్యతో కలిసి ఉంటూ కార్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం భార్య పనిచేసే మెడికల్ షాపు వద్ద స్కూటీ వాహనంపై దింపి కమాన్ వద్ద అపార్ట్‌మెంట్‌లో బండి పార్కు చేసి కనిపించకుండా పోయాడు. రితిక్ కోసం గాలించినా ఫలితం లేకపోయిందని అతడి భార్య ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నేడు జేఎల్ఎం అభ్యర్థుల ఎంపిక పరీక్ష

ముకరంపుర, జూన్ 21: ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ పరిధిలో ఏడో విడుత జూనియర్ లైన్‌మెన్‌ల నియామకానికి శనివారం స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహణతో పాటు సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టనున్నట్లు ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి స్తంభం ఎక్కే పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. జేఎల్ఎం నియామక కమిటీ ద్వారా పరీక్ష పారదర్శకంగా జరుగుతుందని, అభ్యర్థులు ఎలాంటి ప్రలోభాలను నమ్మవద్దని సూచించారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో

గన్నేరువరం, జూన్ 22: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఆంగ్లంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రాయడంలో ప్రావీణ్యం పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు కే రామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

చిగురుమామిడి, జూన్ 21: లంబాడిపల్లి గ్రామంలో ఇటీవల గడ్డం రాజయ్య అనే వ్యక్తి మృతి చెందగా, శుక్రవారం బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య పరామర్శించారు. ఇక్కడ గ్రామాధ్యక్షులు నాగెల్లి రాజిరెడ్డి, కాటం హనుమంత రెడ్డి, బండారిపల్లి రమేశ్, చందబోయిన శ్రీనివాస్, మంద లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

ఇందుర్తిలో వారసంత వేలం

చిగురుమామిడి, జూన్ 21: ఇందుర్తి గ్రామంలో వారసంత (అంగడి వేలం) గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన కూన బాలయ్య రూ 31,500కు వేలంపాటలో వారసంత టెండర్‌ను దక్కించుకున్నారు. ఈ మేరకు ఆయనకు గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీవో శ్రవణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి ఇనుగాల వెంకటరమణారెడ్డి రసీదును అందజేశారు. కార్యక్రమంలో కరోబార్ శంకరాచారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

'శ్రీ చైతన్య'లో ఫ్రెషర్స్ హంగామా

తిమ్మాపూర్, జూన్ 21: ఎల్ఎండీ కాలనీలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం వివిధ విభాగాల ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ పార్టీ వేడుకలు ఘనంగా జరిగాయి. సీఎస్‌డీ విభాగం 'ప్రారంభ్ 2కే24', సివిల్ విభాగం 'యుఫోరియా', మెకానికల్ విభాగం 'గైరేషన్' పేర్లతో వేడుకలు నిర్వహించారు. కళాశాలలోని సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగం సాధించి వెళ్లాలని విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, హెచ్‌వోడీలు శ్రీకాంత్ రెడ్డి, అంజయ్య, రవీందర్, అకాడమిక్ ఇన్‌చార్జి శశికాంత్, ఏవో రామారావు, లైబ్రేరియన్ గొంటి రమేశ్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని ప్రక్షాళన చేయాలి

తెలంగాణచౌక్, జూన్ 21: నీట్ పరీక్ష నిర్వహించడంలో విఫలమైన నేషన్ టెస్టింగ్ ఏజెన్సీని ప్రక్షాళన చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించి, విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు నాగరాజు, కృష్ణ పాల్గొన్నారు.

30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మానకొండూర్, జూన్ 21: అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మానకొండూర్ పోలీసులు గురువారం రాత్రి వాహనతనిఖీలో పట్టుకున్నారు. మండల కేంద్రంలోని బుడగజంగాల కాలనీకి చెందిన మోటం గణేశ్ ఏపీ 29 టీబీ 3016 బొలెరో వాహనంలో బియ్యం తరలిస్తూ సదాశివపల్లి స్టేజీవద్ద పోలీసులకు చిక్కాడు. అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సివిల్‌సప్లయ్ అధికారులు సురేందర్, కమలేశ్‌కు అప్పగించారు.

పోస్టాఫీస్ ఉద్యోగికి సన్మానం

చిగురుమామిడి, జూన్ 21: ఇందుర్తి పోస్టాఫీస్‌లో 20 సంవత్సరాల పాటు విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న భూపతి జగన్ రెడ్డిని గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు.